

వేధిస్తున్నాడని జైలుకు పంపితే.. బెయిల్‌పై వచ్చి చంపేశాడు

- అనకాపల్లిలో బాలిక దారుణ హత్య
- స్కూల్‌కు వెళ్లేదారిలో ఆమెకు తీవ్ర వేధింపులు
- పదిరోజుల క్రితం బెయిల్‌పై బయటకు..
- ఇంట్లోకి చొరబడి కత్తితో నరికి ఘాతుకం


సురేశ్ (ఫైల్)

... మెయిన్ ఎడిషన్‌లో

ఆయన కనుసన్నల్లోనే ఏయూలో పాలన



- కీలక స్థానాల్లో ఉన్నవారంతా ప్రసాదరెడ్డి మనుషులే
- క్యాంపస్‌లో చీమ చిటుక్కుమన్నా తనకు తెలిసేలా సమాచార వ్యవస్థ ఏర్పాటుచేసుకున్న మాజీ వీసీ
- ప్రతి విషయం బయటకు...
- వైసీపీతో అంటకాగిన ఎంతోమంది వర్సిటీ అధికారులు
- కీలక స్థానాల్లో కొనసాగేందుకు ఇప్పుడు కూటమి నేతల ద్వారా పైరవీలు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిపాలన ఇప్పటికీ మాజీ వీసీ ప్రసాదరెడ్డి కనుసన్నల్లోనే జరుగుతోంది. వర్సిటీలో చీమ చిటుక్కుమన్నా తెలిసేలా ఆయన ఎక్కడికక్కడ తన మనుషులను నియమించుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత అన్ని వైపుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి రావడంతో ప్రసాదరెడ్డి కొద్దిరోజుల కిందట వీసీ పదవికి రాజీనామా చేశారు. ఆయన ప్రియ శిష్యుడు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ కూడా తప్పుకున్నారు. అయితే, ప్రసాదరెడ్డి వెళ్లిపోయినా వర్సిటీలో తన అనుచరుల ద్వారా ఇప్పటికీ చక్రం తిప్పుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఆయన నియమించిన అధికారులంతా ఆయన అనుచరులుగానే చెబుతున్నారు. దూరవిద్యలో కీలక స్థానంలో ఉన్న అధికారి, ఆ విభాగంలో కొన్ని నెలలుగా తిష్ఠ వేసిన అధికారి, అలాగే పరీక్షల విభాగంలోని ఇద్దరు అధికారులు ఆయన అనుంగ అనుచరులుగా చెబుతున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో ప్రత్యేకంగా నియమించుకున్న అధికారి, డీన్లుగా ఉన్న ఇద్దరు అధికారులు ఆయనకు ఎప్పటికప్పుడు వర్సిటీలోని సమాచారాన్ని చేరవేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ జాబితాలో రిజిస్ట్రార్ కార్యాలయంలోని కీలక సెక్షన్లలో పనిచేసే అధికారులు కూడా ఉన్నారు. ఏ ఫైల్ ఎక్కడి నుంచి వస్తున్నదీ సమాచారం బయటకు పంపుతున్నారు. అదే సమయంలో వర్సిటీలో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమాల వివరాలను కూడా సెక్యూరిటీ సిబ్బంది ద్వారా ... మిగతా 6వ పేజీలో

2 డిపోల్లో ఇసుక అమ్మకాలు

అగనంపూడిలో టన్ను రూ.1,394, భీమిలిలో రూ.758

ఉచితంగా సరఫరాకు ప్రభుత్వ నిర్ణయం

- అయితే విశాఖ జిల్లాలో రీచ్‌లు లేకపోవడంతో ఇటు తూర్పు, అటు శ్రీకాకుళం జిల్లాల నుంచి ఇసుక తెప్పించాల్సిన పరిస్థితి
- రవాణా వ్యయం, పన్నులు కలిపి ధర నిర్ణయం
- ఇసుక సరఫరాకు కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు
- రీచ్‌ల వద్దకు వెళితే టన్ను రూ.250 మాత్రమే


అగనంపూడి డిపోలో ఇసుక

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ఇసుక ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. జిల్లాలోని రెండు డిపోల్లో ఇప్పటికే ఉన్న 1.2 లక్షల టన్నుల ఇసుకకు అధికారులు ధర నిర్ణయించారు. అగనంపూడి డిపోలో టన్ను రూ.1,394, భీమిలి డిపోలో టన్ను రూ.758గా ఖరారు చేశారు. రాజమండ్రి నుంచి 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న అగనంపూడి డిపోకు ఇసుక రవాణాకు అయిన ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ధర నిర్ణయించారు. శ్రీకాకుళం జిల్లా రీచ్‌ల నుంచి భీమిలికి 90 కి.మీ. దూరం కావడంతో టన్ను రూ.758గా నిర్ణయించాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ వెల్లడించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అగనంపూడి డిపోలో టన్ను రూ.1400లు, భీమిలిలో రూ.1,100కు విక్రయించారు. అగనంపూడి, భీమిలి డిపోలకు ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌చార్జులుగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, గనుల శాఖ సిబ్బంది ఇసుక అమ్మకాలను పర్యవేక్షించనున్నారు.


చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్

రేపటి నుంచి ఇసుక సరఫరా

సోమవారం నుంచి ఉచితంగా ఇసుక విధానం అమలుచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఉదయం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇసుక సరఫరాకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటుచేసి ధరలు నిర్ణయించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు ప్రక్రియ నిర్వహించాలని, ముందు వచ్చిన వారికి ముందు ఇసుక సరఫరా చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలు బట్టి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇసుక రవాణా కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదుల్లో ప్రస్తుతం ఉన్న రీచ్‌లకు అదనంగా కొత్త రీచ్‌లు గుర్తించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వర్చువల్‌గా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ అగనంపూడి, భీమిలిలో రెండు డిపోల్లో ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. అగనంపూడి ... మిగతా 6వ పేజీలో

అవినీతి ఖజానా

- పర్సంటేజీ ఇస్తేనే బిల్లులు ఆమోదం
- జిల్లా ఖజానా కార్యాలయంలో సిబ్బంది దందా
- భారీగా ఫిర్యాదులు అందడంతో కదిలిన ఉన్నతాధికారులు
- రాష్ట్ర ఖజానా డైరెక్టర్ విచారణ
- అధికారులు, సిబ్బందికి మందలింపు


ఖజానా కార్యాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా కార్యాలయంలో కొంతమంది సిబ్బంది దందాపై ఉన్నతాధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. పైసలిస్తేనే బిల్లులు చెల్లిస్తామంటున్నారని ఉద్యోగులు నేరుగా విజయవాడలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా ఖజానా కార్యాలయంలో రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ మోహనరావు విచారణ నిర్వహించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిని పిలిచి విచారించారు.

వైద్య ఆరోగ్యశాఖ, ఆంధ్ర వైద్యకళాశాల, కేజీహెచ్, మానసిక వైద్యశాల, పోలీస్, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లైస్, రోడ్లు, భవనాలు తదితర శాఖల నుంచి వచ్చే బిల్లుల చెల్లింపు కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై ఒక్కొక్కరి నుంచి డైరెక్టర్ వివరాలు సేకరించారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో బిల్లులు ఆమోదించి సీఎఫ్‌ఎంఎస్‌కు అప్‌లోడ్ చేయడానికి సీనియర్, జూనియర్ అకౌంటెంట్లు భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నది ఆరోపణ. అయితే వారిద్దరూ మహిళలు కావడం గమనార్హం. జీతాలతోపాటు జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, సరండర్ లీవ్, గ్రూపు ఇన్సూరెన్స్, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ వంటి బిల్లులు ఆమోదించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇటీవల ఒక ఉద్యోగికి చెందిన రెండు లక్షల బిల్లు ఆమోదించాలంటే 20 వేలు లంచం డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. వీటిపై రాష్ట్ర డైరెక్టర్ విచారణ చేపట్టినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిసింది. ఈ వ్యవహారంలో మధ్యస్థాయి అధికారి ఒకరి హస్తం ఉందన్న ఆరోపణలపై కూడా విచారణ సాగింది. జిల్లా ఖజానా కార్యాలయంలో పలువురు ... మిగతా 6వ పేజీలో

ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి

- వైసీపీ నేతలకు చెందిన జేఎస్‌ఆర్, రాక్‌ట్రీ సంస్థలను పక్కనపెట్టాలని నిర్ణయం
- చిన్న కాంట్రాక్టర్లకు పనుల బాధ్యత
- జిల్లాలో 100 రోజుల్లో 11 వేల ఇళ్ల పూర్తి లక్ష్యం
- గృహ నిర్మాణ సంస్థకు ఆదేశాలు


జగనన్న కాలనీలో అసంపూర్తిగా వున్న ఇళ్లు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన జేఎస్‌ఆర్, రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థలను ప్రభుత్వం పక్కనపెట్టాలని నిర్ణయించింది. వారి స్థానంలో చిన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని గృహ నిర్మాణ సంస్థను ఆదేశించింది. జేఎస్‌ఆర్, రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థలకు ఇచ్చిన నిధులు, సిమెంట్, ఇనుము, ఇసుక తదితర మెటీరియల్ లెక్క తేల్చాలని సూచించింది. ఆప్షన్-3 కింద నిర్మాణ సంస్థలు చేపట్టిన పనులను దశల వారీగా పూర్తిచేయాలని, ఇందుకు 100 రోజుల ప్రణాళిక అమలుచేయాలని ఆదేశాలు జారీచేసింది.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత ప్రభుత్వం నగర శివారుల్లో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళిక రూపొందించింది. అయితే ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో ఆప్షన్-3 కింద అనధికారికంగా ప్రైవేటు సంస్థలకు గత ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వం సిమెంట్, ఇనుము, ఇసుక సరఫరా చేసింది. ఈ మేరకు 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో ఇళ్ల నిర్మాణాలకు గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వేర్వేరు కాలనీల్లో సుమారు 50 వేలకుపైగా ఇళ్ల నిర్మాణ బాధ్యతలను వైసీపీ ఎమ్మెల్యేలకు చెందిన జేఎస్‌ఆర్, రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థలకు అప్పగించారు. అయితే పనులు మందకొడిగా సాగాయి. గడచిన రెండేళ్లలో 16,585 ఇళ్లకు స్లాబులు పడగా, మరో 3,850 ఇళ్లు స్లాబులకు సిద్ధంగా ఉన్నాయి. మరో 30 వేల ఇళ్లు పునాదుల వరకూ అయ్యాయి. ఇంకో 30 వేల ఇళ్లకు పునాదుల కోసం గోతులు తీయగా, 20 వేల ఇళ్లు పనులు అసలు ప్రారంభించలేదు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడంలో ముఖ్యంగా రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా విఫలమైంది. ఎన్నికలు నోటిఫికేషన్ రావడంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు నిలిపివేశారు. ఫలితాలు వచ్చిన తరువాత తట్టాబుట్టా సర్దేశారు. దీంతో ఇంచుమించుగా ... మిగతా 6వ పేజీలో


పూరీ ప్రత్యేక రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తదితరులు

రూ.600 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి

- త్వరలో టెండర్లు
- పూరీ ప్రత్యేక రైలు ప్రారంభ కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్
- వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ కోసం త్వరలో మంత్రిని కలవనున్నాం

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.600 కోట్లతో త్వరలో టెండర్లు పిలవనున్నామని ఎంపీ ఎం.శ్రీభరత్ వెల్లడించారు. పూరీ జగన్నాధ రథయాత్రకు విశాఖ నుంచి భక్తులను బయలుదేరిన ప్రత్యేక రైలుకు శనివారం ఉదయం ఆయన పచ్చ జెండా ఊపారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ కోసం త్వరలో రైల్వే మంత్రిని కలవనున్నామని చెప్పారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విశాఖపట్నం నుంచి మరిన్ని వందే భారత్ రైళ్ల కోసం ప్రయత్నం చేస్తామన్నారు. విశాఖపట్నం-విజయవాడ మధ్య రైల్వే ట్రాక్ అభివృద్ధి పనులు త్వరితంగా పూర్తి చేసి రద్దయిన రైళ్లను వీలైనంత వేగంగా పునరుద్ధరించాలని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను కోరారు. పేద, మధ్య తరగతి ప్రజల సౌలభ్యం కోసం మరిన్ని రైళ్లను విశాఖ నుంచి ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆ విల్లాలను అలాగే వదిలేశారు

ఆంధ్ర మెడికల్ కాలేజీ స్థలంలో వైసీపీ హయాంలో ఐఏఎస్‌ల కోసం విల్లాలు

- రూ.8.7 కోట్లతో పనులు...
- ఇక్కడ కొంతమంది...అక్కడ కొంతమంది ఎందుకంటూ మధ్యలో రాజధాని కమిటీ పెదవివిరుపు
- తదనంతరం నిలిచిన నిధులు...
- అసంపూర్తిగా భవనాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నమే పరిపాలనా రాజధాని అంటూ వైసీపీ పాలనలో ఎక్కడికక్కడ వారికి అనుకూలమైన నిర్మాణాలు చేపట్టారు. నాటి ముఖ్యమంత్రి కోసం రుషికొండపై రాజమహల్ నిర్మిస్తే...ఆయనకు బాజాలు వాయించే ఐఏఎస్ అధికారుల కోసం జిల్లా పరిషత్ జంక్షన్‌లో విల్లాల నిర్మాణానికి నడుం కట్టారు. అంకోసా వెనుక ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన స్థలం ఉంది. అందులో పాడుబడిన డాక్టర్ల క్వార్టర్లు ఉండేవి. నగర నడిబొడ్డున కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉండడంతో ఆ స్థలంపై నాటి సీనియర్ ఐఏఎస్‌ల కన్ను పడింది. ముఖ్యమంత్రికి రుషికొండలో నిర్మించినట్టే ఇక్కడ అధికారుల స్థాయికి తగ్గట్టు విల్లాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. రుషికొండలో పర్యాటకుల కోసం భవనం నిర్మిస్తున్నామని చెప్పినట్టే...ఇక్కడ కూడా డాక్టర్ల కోసమే క్వార్టర్లు నిర్మిస్తున్నామని కలరింగ్ ఇచ్చారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కి, కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు క్వార్టర్లు, మిగిలినవి సీనియర్లకు కేటాయిస్తారని బుకాయించరు కానీ సీఎం జగన్ పేషీలో కొందరు ఐఏఎస్ అధికారుల కోసమే వీటిని ప్లాన్ చేశారు. మొత్తం ఏడు విల్లాలను 35 వేల చ.అ. విస్తీర్ణంలో నిర్మించడానికి రూ.8.7 కోట్లు కేటాయించారు. ఇది వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన స్థలం కాబట్టి నిర్మాణ బాధ్యతలను తెలివిగా ఏపీఎంఎస్‌ఐడీసీకి అప్పగించారు. ఏడాదిపాటు పనులు చాలా వేగంగా జరిగాయి. విల్లాలు రూపుదిద్దుకున్నాయి. పరిశీలనకు వచ్చిన రాజధాని కమిటీ అధికారుల బృందం పెదవి విరిచింది. ఏడు విల్లాలు ఎలా సరిపోతాయి?, ఇక్కడ కొందరు?, ... మిగతా 6వ పేజీలో



అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలు

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా రవీంద్ర బాధ్యతల స్వీకారం


బాధ్యతలు చేపట్టిన కమిషనర్ రవీంద్రను అభినందిస్తున్న అధికారులు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా వి.రవీంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కమిషనర్ పోస్టు ఖాళీ కావడంతో కొత్త వారిని నియమించే వరకూ పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం ఆ ఛాంబర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సెక్రటరీ కీర్తి, చీఫ్ ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్ఈ బలరాము నాయుడు, సీఏఓ హరిప్రసాద్, డీఎఫ్ఓ శాంతిస్వరూప్ తదితరులు ఆయన్ను కలిసి అభినందించారు. అన్ని విభాగాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జూన్‌లో పెరిగిన విమానాల సంఖ్య



- గత ఏడాది జూన్‌లో 1,692, ఈ ఏడాది 1,704...
- ప్రయాణికుల సంఖ్య మాత్రం స్వల్పంగా తగ్గుదల

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే విమానాల సంఖ్య జూన్ నెలలో కాసింత పెరిగింది. గత ఏడాది జూన్‌లో 1,692 విమానాలు రాకపోకలు సాగించగా, ఈఏడాది జూన్‌లో వాటి సంఖ్య 1,704కు పెరిగింది. అయితే విమాన ప్రయాణికుల సంఖ్య స్వల్పంగా తగ్గింది. గత ఏడాది జూన్‌లో 2,54,490 మంది ప్రయాణించగా, ఈ జూన్‌లో 2,32,149 మంది ప్రయాణం చేశారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నరేశ్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మలు తెలిపారు. డిజి యాత్ర విధానం అమలు వల్ల విమాన ప్రయాణికులు చాలా త్వరగా క్లియరెన్స్ తీసుకొని కేటాయించిన లాంజ్‌లోకి వెళ్లగలుగుతున్నారని వివరించారు. చెకిన్ టైమ్‌ను ఇది బాగా తగ్గిస్తున్నదని పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన

జగదాంబ కూడలి, జూలై 6: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి తులసీదళార్చనతో శనివారం పూజలు నిర్వహించారు. అర్చకులు ఉభయదాతలు, అధికారులు పాల్గొన్నారు.

ఘోషాసుపత్రిలో వసతుల కల్పనకు చర్యలు

» దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ

జగదాంబ కూడలి, జూలై 6: వన్‌టౌన్‌లోని విక్టోరియా ఘోషాసుపత్రిలో వసతి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్ పలు ప్రతిపాదనలను ఆయన దృష్టి తెచ్చారు. గతంలో సీఎస్ఆర్ నిధులలో భవన నిర్మాణాల ఆధునికీకరణకు ప్రతిపాదన చేసినా, నేటికి పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ భవనం నిర్మాణం, డైట్, అత్యవసర గర్భిణులకు ప్రస్తుతం ఓ షెడ్‌లో పడకలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సీనియర్ ప్రొఫెసర్లకు చాంబర్స్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. పడకల సంఖ్య మరింత పెంచాలన్న ప్రతిపాదనలను ఆ యనకు వివరించారు. దీనికి సంబంధిన నివేదికను ఆ యనకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసుపత్రిలో భవనాల ఆధునికీకరణకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎస్ఆర్ నిధులతో అడ్మినిస్ట్రేట్ కార్యాలయ భవనంతోపాటు గర్భిణుల కోసం ప్రత్యేకంగా భవన నిర్మాణంపై ఏపీఎంహెచ్ఐడీసీ అధికారులతో మాట్లాడనున్నట్టు చెప్పారు. షెడ్‌ల్లో అత్యవసర గర్భిణుల వార్డు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే ఇక్కడ మూడు అంతస్తుల్లో భవననిర్మాణం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా నర్సుల సంఘం సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ ఉద్యోగుల నుంచి వస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. ప్రొఫెసర్లు డాక్టర్ విద్యారమ, లక్ష్మి, ఏవో ఎల్.విజయకుమార్, టీడీపీ నాయకులు గోడి నరసింహాచారి, రాము, గంగాడ గోవింద్, త్రినాద్, జనసేన పార్టీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రమిస్తున్న నర్సులు

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి : ఏసీపీ



మాట్లాడుతున్న క్రైమ్ ఏసీపీ వెంకటరావు

సీతమ్మధార, జూలై 6: యువత డ్రగ్స్‌కి బానిస కాకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని క్రైమ్ ఏసీపీ వెంకటరావు పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఎన్‌బీఎం లా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన, ఇళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, చైన్ స్నాచింగ్స్, మొబైల్ స్నాచింగ్స్, వాహనాల చోరీలు తదితర అంశాలపై జాగ్రత్తలు, ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త లా చట్టాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రమణ, ఎస్ఐలు భాస్కరరావు, ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మహారాణిపేట, జూలై 6: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్య పరిష్కరానికి సహకారం అందిస్తానని సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కిరణకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యేతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పీజే గణేష్ కుమార్, నాయకులు అనిమిరెడ్డి రమణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీకృష్ణకు జ్ఞాపిక అందిస్తున్న ఉద్యోగులు

చిన్నారులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి



మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా పరిరక్షించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలలు - మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలపై వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వశాఖల సహకారంతో డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, సీడబ్ల్యూసీ చైర్మన్ ఎంఆర్ఎల్ రాధ, ఐసీడీఎస్ పీడీ జి జయదేవి, డీఈవో ఎల్ చంద్రకళ, దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ వివేకానంద, పాల్గొన్నారు.

డీసీసీబీలో ఘనంగా సహకార దినోత్సవం

మర్రిపాలెం, జూలై 6: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం మర్రిపాలెం వుడాకాలనీలోని డీసీసీబీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు సీఈఓ డీవీఎస్ వర్మ ఆధ్వర్యంలో తొలుత పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సహకార బ్యాంకుల అభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమైందన్నారు. అలాగే, వారి సమస్యల పరిష్కార బాధ్యత తమపై ఉందన్నారు. రానున్న కాలంలో తమ శాఖల ద్వారా ఖాతాదారులకు, రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కోపరేటివ్ బ్యాంక్ అధికారి గోవిందరావు, విశాఖ జిల్లా డిప్యూటీ రిజస్ట్రార్ దుర్గాప్రసాద్, జి.హరి ప్రసాద్, సహకార విద్యాధికారి జి.సోమేశ్వరరావు, డి. అన్నపూర్ణ, బి.శ్రీనివాసరావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సహకార దినోత్సవంలో అధికారులు, ఉద్యోగులు

'కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి'



గండి బాబ్జీకి వినతి పత్రమిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 6: గ్రేటర్ 42వ వార్డులో టీడీపీ బలోపేతానికి, ఇటీవల కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, వార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని కోరారు. ఈ మేరకు ఆయనకు శనివారం వినతిపత్రమిచ్చారు. వార్డు ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నేతలు దువ్వి కాశీప్రసాద్, ఎంఎల్ఎస్ రావు, ముప్పళ్ల శ్రీకృష్ణ, జీకే ఉన్నారు.

వారాహి అమ్మవారి ఉత్సవాలు

అల్లిపురం, జూలై 7:అల్లిపురంలోని వివేకానందవీధిలోని సాయిశ్రీ మేరు ట్రస్ట్ సాయి దర్బార్ ప్రాంగణంలో శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ప్రసన్న, పి.శ్రీనివాస సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వప్నప్రియ, పద్మజ, పద్మావతి, గ్రంధి రమా, రూపాదేవి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్చరీలో పతకాలు



గణేష్ మణిరత్నంను సన్మానిస్తున్న దృశ్యం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 6: అంతర్జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్ టోర్నీలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి గణేష్ మణిరత్నం పతకాలు సాధించాడు. ఐర్లాండ్‌లో వరల్డ్ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రజత పతకం, కొరియాలో జరిగిన ఆసియా కప్ ఆర్చరీ టోర్నీలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం సంస్కృతి గ్లోబల్ స్కూల్ యాజమాన్యం గణేష్ మణిరత్నంను సత్కరించి అభినందించింది. జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, స్కూల్ సీఈవో కే నిశాంత్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, క్రీడా కార్యదర్శి ముద్దుబాబు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రైనీ ఐపీఎస్‌లతో సమావేశం


మహారాణిపేట, జూలై 6: మేరీటైమ్ సెక్యూరిటీ మాడ్యూల్ నిమిత్తం నగరానికి వచ్చిన 28 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులతో పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సమావేశమయ్యారు. శనివారం బీచ్ రోడ్డులో ఉన్న పోలీసు ఆఫీసర్స్ మెస్‌లో జరిగిన ఈ భేటీలో తమ అనుభవాలు మెలకవలను కమిషనర్ వివరించారు. విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు .

'ముస్లింలను ఆదుకుంటాం'

అక్కయ్యపాలెం, జూలై 6 : పేద ముస్లింలను ఆదుకొనేందుకు ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కృషి చేస్తుందని అధ్యక్షుడు హైదరాలి సింకా తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో పేద ముస్లిం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవ అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నజీర్ మాట్లాడుతూ.. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సేవలను కొనియాడారు. అనంతరం సొసైటీ సభ్యులు నజీర్‌ను ఘనంగా సత్కరించారు.సొసైటీ గౌరవాధ్యక్షుడు షేక్ అబ్దుల్ మునీర్, ఉపాధ్యక్షుడు అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి అమీర్ జాన్, అలీ ఖాన్, హేక్ అహ్మద్ వలి పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలు అనుసరణీయం

పూర్ణామార్కెట్, జూలై 6: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటి యువత పనిచేయాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ పిలుపు నిచ్చారు. శనివారం గ్రేటర్ 36వ వార్డు రంగిరీజు వీధిలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాబూ జగజ్జీవన్‌రామ్ చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలు మరువరాలేనివని గుర్తు చేశారు. ముందుగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు, జనసేన పార్టీ నేత పిల్లి రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

సీతమ్మధార: సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి మహిళా నేత శ్యామల దీపిక పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు గంధ్రెడ్డి రాకేష్, జాన్, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా 46వ వార్డు కొండ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ శనివారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత ఆయన స్ఫూర్తితో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో

మహారాణిపేట: బీజేపీ నాయకుల మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు విజయానందరెడ్డి, ప్రకాష్ రెడ్డి, దామోదర్, కోరాడ సాయి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ వారియర్స్‌పై కోస్టల్ రైడర్స్ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 6: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన కోస్టల్ రైడర్స్ మూడు పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్‌పై గెలుపొందింది. తొలి బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 168 పరుగులు చేసింది. షేక్ రషీద్ హాఫ్ సెంచరీ (67), ధరణి కుమార్ (21), అభిషేక్‌రెడ్డి (28), నరసింహరాజు (23నాటౌట్) రాణించారు. వైజాగ్ వారియర్స్ బౌలర్ వై.రెడ్డి ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 162 పరుగులు చేసి కేవలం మూడు పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. అశ్విన్ హెబ్బర్ (31), శ్రీకర్ భరత్ హాఫ్ సెంచరీ (69), కరణ్ షిండే (41) రాణించినా ఫలితం లేకపోయింది. కోస్టల్ రైడర్ బౌలర్ స్టీఫెన్ మూడు వికెట్లు తీశాడు.

బోరుకు మరమ్మతులు

డాబాగార్డెన్స్, జూలై 6: ఎల్లమ్మతోట ప్రాంతంలో ఎస్‌బీఐ బ్యాంకు వద్ద కొద్ది రోజులుగా మూలకు చేరిన చేతిపంపు అందుబాటులోకి వచ్చింది. టీడీపీ వార్డు అధ్యక్షులు సారిపల్లి మహేష్ చొరవతో వాటర్‌వర్క్సు సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్సు సిబ్బంది మోహన్, బూత్ ప్రెసిడెంట్ జి. ఎల్లాజీ, అంటాడ అప్పారావు పాల్గొన్నారు.

2 డిపోల్లో ఇసుక అమ్మకాలు

... 5వ పేజీ తరువాయి

డిపోకు రాజమండ్రి నుంచి, భీమిలికి శ్రీకాకుళం నుంచి ఇసుక సరఫరా చేయడంతో రెండింటి మధ్య ధరల్లో వ్యత్యాసం ఉంటుందన్నారు. కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, గనుల శాఖ ఏడీ డీవీవీఎస్ఎస్ఎన్ రాజు, జిల్లా ఉప రవాణా కమిషనర్ రాజారత్నం, జిల్లా పంచాయతీ అధికారి ఎంవీఎస్ శ్రీనివాసరావు, జల వనరుల శాఖ డీఈ చరణ్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈలు పి.శ్రీలక్ష్మి, ఎఎస్ఆర్‌సీ మూర్తి, తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జేసీ సమావేశమయ్యారు. సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఇసుక రవాణాకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇసుక సరఫరాలో ఎటువంటి అవకతవకలు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

ఇసుక సరఫరాలో రవాణా చార్జీలు వసూలు

అయితే విశాఖ జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో గల రీచ్‌లకు వెళ్లి సీనరేజ్, ఇతర పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. రీచ్‌లకు వెళ్లలేని వారికి నగరంలో అగనంపూడి, భీమిలి డిపోల్లో ఇసుక అందిస్తారు. రీచ్‌ల నుంచి రెండు డిపోలకు ఇసుక రవాణాకు అయ్యే చార్జీలు, పన్నులు మాత్రం వసూలుచేస్తారు. ఈ నేపథ్యంలో అగనంపూడి డిపోలో టన్ను ఇసుక రూ.1394, భీమిలి డిపోలో రూ.758కు అందించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఒక వ్యక్తికి 20 టన్నులు ఇసుక మాత్రమే సరఫరా చేస్తారు. ఆధార్ కార్డు నంబరు చూపించి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తే ఇసుక సరఫరా చేస్తామని జిల్లా గనుల శాఖ అధికారి రాజు తెలిపారు.

ఇసుక కోసం పొరుగు జిల్లాలపై ఆధారపడాల్సిందే...

రాష్ట్రంలో అత్యధికంగా నిర్మాణాలు జరిగే విశాఖ నగరం, పరిసరాల్లో నెలకు సగటున 60 వేల టన్నుల ఇసుక అవసరం. అంత ఇసుక ఈ జిల్లాల్లో ఉండదు. జిల్లాలో ఒకే ఒక నది గోస్తనీలో ఇసుక లభ్యత అత్యంత స్వల్పం. ఉమ్మడి జిల్లాలో శారదా, వరహా, తాండవ నదుల్లో కూడా ఇసుక లభ్యత పరిమితం. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న నదుల్లో లభ్యమైన ఇసుకను థర్డ్ ఆర్డర్ రీచ్‌లుగా పిలుస్తారు. కేవలం స్థానికంగా కొద్దిపాటి అవసరాలకు మాత్రమే ఈ రీచ్‌లలో ఉన్న ఇసుక సరిపోతుంది. అందువల్ల విశాఖ నగరంలో నిర్మాణాలకు అవసరమైన ఇసుక కోసం పొరుగున్న శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాలపై ఆధారపడాల్సిందే. శ్రీకాకుళంలో వంశధార, నాగావళి, తూర్పుగోదావరిలో ఉన్న గోదావరి నదుల్లో పుష్కలంగా ఇసుక నిల్వలు ఉన్నాయి. అందువల్ల నగరానికి 220 కి.మీ. దూరంలో ఉన్న గోదావరి నది, 100 కి.మీ. దూరంలో ఉన్న నాగావళి, 120 కి.మీ. దూరంలో ఉన్న వంశధార నుంచి ఇసుక తీసుకురావాలి. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నా...రీచ్‌ల నుంచి నగరానికి తీసుకువచ్చేందుకు అయ్యే రవాణా చార్జీలు, పలు రకాల పన్నులు కలిపి టన్నుకు అగనంపూడి డిపోలో రూ.1,394, భీమిలిలోఅయితే రూ.758 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఉండదు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నదులు అందుబాటులో ఉన్నాయి. ఇసుక అవసరమైన వ్యక్తి ట్రాక్టర్‌తో రీచ్‌కు వెళ్లి టన్నుకు రూ.260 చెల్లిస్తే సరిపోతుంది. ఇసుక ఇంటికి చేరడానికి టన్నుకు మహా అయితే రూ.ఐదు వందల నుంచి రూ.ఆరు వందలు ఖర్చవుతుంది. అదే విశాఖలో మాత్రం గోదావరి ఇసుకకు రూ.1,394, శ్రీకాకుళం జిల్లా ఇసుక రూ.758లు ఖర్చుచేయాలని అధికారులు వివరించారు.

ఆ విల్లాలను అలాగే వదిలేశారు

... 5వ పేజీ తరువాయి

అక్కడ కొందరు ఎలా ఉంటారు?...అంటూ ప్రశ్నలు గుప్పించి వెళ్లిపోయింది. అంతే ఆ తరువాత ఆ నిర్మాణాలకు నిధులు ఆగిపోయాయి. ఆరా తీస్తే అవి తమకు అవసరం లేదని జగన్ భజన బృందం తెగేసి చెప్పినట్టు తెలిసింది. వాస్తవానికి ఆ పనులు వెంటనే పూర్తయిపోయేవే. కానీ ఏపీఎంఎస్ఐడీసీకి సిబ్బంది కొరత ఉండడం, అదే సంస్థకు పాడేరు, మాకవరపాలెంలలో మెడికల్ కాలేజీ నిర్మాణం పనులు అప్పగించడం వల్ల వీటిపై దృష్టిపెట్టలేదు. ఆ విల్లాలు తమకు అవసరం లేదని, మెడికల్ కాలేజీకే ఇచ్చేయండని చెప్పేశారు. నిధులు మాత్రం విడుదల కాలేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది. త్వరగా వాటిని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని యోచిస్తోంది. త్వరలో జరిగే సమీక్ష సమావేశాల్లో వీటిపై చర్చ జరిగే అవకాశం ఉందని విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.

అవినీతి ఖజానా

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులు ఏళ్ల తరబడి తిష్ట వేయడం, కొందరు సంఘ బాధ్యులంటూ ఇక్కడే ఉండడం, కొందరు సక్రమంగా విధులకు రాకపోవడం వంటివి విచారణలో రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి వచ్చాయి. పది రోజుల క్రితం విధులకు సక్రమంగా హాజరుకాని పలువురు ఉద్యోగులకు షోకాజ్ జారీచేసిన విషయం కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చింది. ఇదిలావుండగా విచారణ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. బిల్లులు ఆమోదించేందుకు పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పైసలు ఇవ్వకపోతే కొర్రీలు వేస్తున్నారని ఆరోపించారు. ఏ విధంగా చెప్పినా కొందరు సిబ్బంది తీరు మారలేదని, అందుకే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా ఖజానా అధికారి సుధాకర్, ఇతర అధికారులను ఖజానా శాఖ డైరెక్టర్ మందలించినట్టు తెలిసింది. భవిష్యత్తులో ఆరోపణలు రాకుండా విధి నిర్వహణలో కఠినంగా ఉండాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి

... 5వ పేజీ తరువాయి

మూడు నెలల నుంచి పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు మధ్యలో నిలిపివేయకుండా పూర్తిచేయాలని నిర్ణయించింది. వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు చెందిన జేఎస్ఆర్, రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థకు మాత్రం పనులు అప్పగించవద్దని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు పనుల పురోగతిపై గృహ నిర్మాణ శాఖా మంత్రి పార్థసారధి సమీక్షించి అధికారులు ఆదేశాలు ఇచ్చారు. రెండు పెద్ద సంస్థలకు చెందిన లావాదేవీలపై వెంటనే లెక్కలు తేల్చాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు చిన్నపాటి సంస్థలకు అప్పగించాలని సూచించారు. ఇంకా ఇళ్ల నిర్మాణాల కోసం 100 రోజుల ప్రణాళిక రూపొందించారు. 100 రోజుల వ్యవధిలో జిల్లాలో 73 కాలనీల్లో 11 వేల ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసేలా సిద్ధం చేయాలని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో జిల్లా హౌసింగ్ అధికారులు 100 రోజుల ప్రణాళిక అమలుకు సన్నాహాలు ప్రారంభించారు. జిల్లాలో ఏడు నుంచి 10 మంది వరకు చిన్నపాటి కాంట్రాక్టర్లతో మాట్లాడి కాలనీలకు కూలీలను రప్పించి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఉత్తరాదికి చెందిన కూలీలు వెనక్కి రావాలంటే కనీసం రెండు,మూడు వారాలు పడుతుంది. ఇంకా వర్షాకాలం కావడంతో మరికొన్ని ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. అందువల్ల తొలుత స్లాబులు వేసిన ఇళ్ల లోపల పనులు తొలుత పూర్తి చేయాలని యోచిస్తున్నారు.

ఆయన కనుసన్నల్లోనే ఏయూలో పాలన

... 5వ పేజీ తరువాయి

ఎప్పటికప్పుడు ప్రసాదరెడ్డి తెలుసుకుంటున్నట్టు సమాచారం.

కొనసాగే ప్రయత్నాల్లో

గడిచిన ఐదేళ్లుగా కీలక స్థానాల్లో ఉన్న ఎంతోమంది అధికారులు, ప్రొఫెసర్లు వైసీపీతో అంటకాగారు. అదే స్థానాల్లో కొనసాగేందుకు ఇప్పుడు వారు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.



మొక్క నాటుతున్న ఉక్కు డైరెక్టర్ జీవీఎస్ ప్రసాద్

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 6: మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జీవీఎస్ ప్రసాద్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం నిర్వహించిన వన మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అనేక దశాబ్దాలుగా విరివిగా మొక్కలు నాటుతున్నామని, కర్మాగారం ఆవరణలో లక్షలాది మొక్కలు ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఏదో ఒక సందర్భంలో మొక్కలు నాటడంతో నాటి వాటిని పరిరక్షిస్తే పర్యావరణం ఎంతో బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ జీఎం జి.గాంధీ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రసాద్

పెందుర్తి, జూలై 6: పెందుర్తి ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్లూరు ప్రసాద్ (జేసీబీ) విద్యార్థులు 800 మంది విద్యార్థులకు 5వేలునోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా జేసీబీ ప్రసాద్ మాట్లాడుతూ 2009 నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో 12 పాఠశాలల్లో ఏటా రెండు వేల మంది విద్యార్థులకు 11 వేల నోటు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది.ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మల్కాపురం, జూలై 6: మల్కాపురం కళంజియా సమాఖ్య, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాను హెచ్‌పీసీఎల్ సీజీఎం వెంకటనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆ యన మాట్లాడారు. హెచ్‌పీసీఎల్ నిరంతరం సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. జనరల్ ఫిజిషియన్, గైనిక్, ఆర్థో, లివర్, డెంటల్, చర్మ వ్యాధుల నిపుణులు కిమ్స్ ఆస్పత్రి నుంచి హాజరై దాదాపు 500 మందికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ హెచ్‌ఆర్ మేనేజర్ కాళీ, దాన్ పౌండేషన్ రీజనల్ కో-ఆ ర్డినేటర్ రామ్‌కుమార్, సమాఖ్య కో-ఆర్డినేటర్ సుభాషిణి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

70 వార్డులో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ

ఆటోనగర్, జూలై 6: దోమకాటుతో వచ్చే వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారని జెడ్పీ సన్యాసి నాయుడు అన్నారు. 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను తరిమికొట్టవచ్చన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చందు, కూటమి నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, బి.రమణ, ఎంఎస్ఎన్ రాజు, నాయుడు, శ్రీకాంత్, కృష్ణ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళారమ్మ మారువారం పండగ

కూర్మన్నపాలెం,జూలై 6: కణితి అంబేడ్కర్ కాలనీలో గ్రామ దేవతల కమిటీ ఆధ్వర్యంలో శనివారం కళారమ్మ మారువారం పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు జరిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, సూరిశెట్టి పెంటారావు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహారాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37,టమాటా 37, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 82, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది) 145, బరబటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 28, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్యాప్రెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

వర్ధంతి సందర్భంగా పలుచోట్ల నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, పలు విభాగాల అధికారులు



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉక్కు జీఎం, తదితరులు



భెల్ హెచ్‌పీవీపీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈడీ, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్/అక్కిరెడ్డిపాలెం, జూలై 6: దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్‌ఆర్) కె.సంజీవరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలు ఒక్క దళిత వర్గానికే కాకుండా అన్ని వర్గాలకు అందించి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొండ తౌడన్న, బయ్యే మల్లయ్య, ప్రతినిధులు సత్యనారాయణ, కేవీ రత్నం, ఎల్‌వీ రమణ, మోహన్‌బాబు, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బెల్ హెచ్‌పీవీపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జితేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కొల్లి దేముడు, ఎస్.లీల, కె.శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు ఎస్.సాహూ, వీవీఎన్ రాజు, బీటీపీ ప్రకాశ్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మాజీ ఉప ప్రధాని దివంగత జగ్జీవన్‌రామ్ అపజయం లేని రాజకీయ నాయకుడని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు గంట్యాడ గురుమూర్తి, మాటూరి శ్రీనివాసరావు, గంట్యాడ గోవిందరాజు, ఎం.పరదేశి, ములకలపల్లి ఈశ్వరరావు, బీజేపీ నాయకుడు కిలాని ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ మండల నాయకులు పెదగంట్యాడ టీడీపీ శ్రేణులు పెదగంట్యాడ జంక్షన్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. నాయకులు ములకలపల్లి పెంటయ్య, పంచదార్ల ఉగ్రం, శ్రీముసురు శ్రీనివాసరావు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు దీపక్, బీజేపీ నాయకుడు ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఇక్కడి లక్ష్మీనగర్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడుగా, సంఘ సంస్కర్తగా బాబూజీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మల్కాపురం ఎస్సీ కాలనీ, ప్రకాశనగర్, ములగాడ ప్రాంతాల్లో నిర్వహించారు. ఆయా ప్రాంతాల దళిత నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కణితి రోడ్డులో ట్రాఫిక్ సమస్యలకు చెక్

రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు





దుకాణాలను తొలగించడంతో విశాలంగా ఉన్న కణితి రోడ్డు. (ఇన్‌సెట్లో) రోడ్డు పక్క షాపులను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గాజువాక, జూలై 6: కణితి రోడ్డులో ట్రాఫిక్ సమస్యలకు పోలీసులు చెక్ పెట్టారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించేలా కణితి రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించేందుకు శనివారం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రధానంగా ఈ రహదారికి ఇరుపక్కలా ఉన్న పలు దుకాణాలు, కూరగాయల వ్యాపారాలు, తోపుడుబళ్ల నిర్వహణ మూలంగా నిత్యం ఈ రోడ్డు కొనుగోలుదారులతో కిటకిటలాడేది. సాయంత్రమైతే రద్దీ మరింత అధికంగా ఉండేది. దీంతో ఈ ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానాపాట్లు పడేవారు. జనాల రద్దీకి తోడు పశువుల సంచారం కూడా అధికంగా ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవించేవి. ఈ క్రమంలో కణితి రోడ్డులో ట్రాఫిక్‌పరమైన ఇబ్బందులను తొలగించాలంటూ ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లేలా ఉన్న దుకాణాలను కొన్నింటిని తొలగించడంతో పాటు మరికొన్నింటిని మరింత వెనక్కి జరిపించారు. ఎవరైనా రహదారిపై వ్యాపారాలు నిర్వహించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. రోడ్లపై దుకాణాలను ఏర్పాటు చేయడం వల్లే ట్రాఫిక్ పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇకపై తాము ఎప్పటికప్పుడు ఈ రహదారిని పర్యవేక్షిస్తామని తెలిపారు. ఎట్టకేలకు ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు పోలీసులు అడ్డుకట్ట వేయడంతో పలువురు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ర్యాబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు

పలుచోట్ల ప్రపంచ జునోసిస్ డే వేడుకలు



బాజీ జంక్షన్ వద్దగల పశు వైద్యశాలలో పెంపుడు కుక్కకు టీకా వేయిస్తున్న గణబాబు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 6: ర్యాబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. బాజీ జంక్షన్ సంత పక్కన ఉన్న పశు వైద్యశాలలో నిర్వహించిన ప్రపంచ జునోసిస్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పెంపుడు కుక్కలకు ఉచిత ర్యాబిస్ టీకాలను వేయించారు. అలాగే ఆస్పత్రిలో దాతలు సౌకర్యంతో ఏర్పాటు చేసిన అదనపు గదులు, టేబుల్స్, వివిధ పరికరాలను ఆయన ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డి.రామకృష్ణ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు 280 వరకు జబ్బులు రావడానికి ఆస్కారం ఉందని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పశువుల ఆస్పత్రి అభివృద్ధికి సహకరించిన పెనుమత్స వెంకటసత్యరామరాజు, అయ్యపురెడ్డి, అచ్చియనాయుడు, శ్రావణి షిప్పింగ్ ప్రతనిధులను సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.ప్రసాద్, గోపాలపట్నం ఆస్పత్రి వైద్యాధికారి ఎ.రవి కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, యలమంచిలి ప్రసాద్, నరవ అనూష తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక పశు వైద్య కేంద్రంలో నిర్వహించిన శిబిరంలో పశువైద్యాధికారి జగన్మోహన రావు 412 పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు ఉచితంగా వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ర్యాబిస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉం డాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడి: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా యాంటీ ర్యాబిస్ టీకాలను వేయించాలని స్థానిక పశు వైద్యశాల డాక్టర్ పి.లావణ్య సూచించారు. ఇక్కడి పశువుల ఆస్పత్రిలో నిర్వహించిన జునోసిస్ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జంతువుల ద్వారా మనుషులకు వ్యాపించే వ్యాధులను జునోటిక్ వ్యాధులుగా పేర్కొంటారన్నారు. అనంతరం పలు పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు ఇందిరారాణి, స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బలిరెడ్డి శ్రీను, వడ్డాది శ్రీనివాసరావు, సాయిన సన్యాసిరావు, సిబ్బంది అప్పలరాజు, తాతారావు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సింధియా: పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు తప్పనిసరిగా యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలని గ్రాంధీగ్రామ్ పశు వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. సింధియా గ్రాంధీగ్రామ్ పశు వైద్యశాలలో శనివారం అంతర్జాతీయ జునోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వేల డోస్‌లకు పైగా యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌కు పెంపుడు కుక్కలకు వేయడం జరిగిందన్నారు. పిచ్చికుక్క మనుషులను కరిస్తే ఐదు డోసుల వ్యాక్సిన్ వేయాలన్నారు. కుక్క లాలాజలంతో కూడా ర్యాబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున ఏటా కుక్కలను పెంచేవారంతా వాటికి వ్యాక్సిన్ వేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు ఆర్‌ఆర్ రాజు, కల్లూరి రామారావు, శేఖర్, మను, తదితరులు పాల్గొన్నారు.



గాంధీగ్రామ్ పశు వైద్యశాలలో శునకాలకు టీకాలు వేస్తున్న వైద్యులు



అగనంపూడి పశు వైద్యశాలలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ లావణ్య



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

వైసీపీ హయాంలో రాజ్యమేలిన రేషన్ మాఫియా

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, జూలై 6: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ మాఫయా రాజ్యమేలిందని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆరోపించారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు అధికారుల అండతో రేషన్ మాఫియా చెలరేగిపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అటువంటి నాటకాలు జరగవని, పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టించాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. దొంగచాటుగా వ్యాపారం చేసే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు దశేంద్ర, నాగేశ్వరరావు, వాసు, ఉగ్రం, అనంత్, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి'

ఆర్పీ పేట,(కంచరపాలెం), జూలై 6: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, వార్డు స్థాయి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే గణబాబు సూచించారు. స్థానిక ఐటీఐ జంక్షన్ సమీపంలోని కల్యాణ మండపంలో శనివారం జీవీఎంసీ 56,57,52 వార్డులకు చెందిన నాయకులు, జీవీఎంసీ అధికారులతో గణబాబు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పెండింగ్ పనులు, వార్డు స్థాయి సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ వర్క్స్, పైపులైన్, యూజీడీ, స్ట్రీట్ లైట్స్, ఎలక్ట్రికల్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. త్వరలో వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐదోజోన్ అధికారులు, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, అజయ్‌బాబు, కుట్టా కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి మాతకు ప్రత్యేక పూజలు



కూర్మన్నపాలెం, జూలై 6: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలోని సంపత్ వినాయక ఆలయంలో శనివారం ఆషాఢ మాస పాడ్యమినిను పురస్కరించుకొని వారాహి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శివాజీ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

విభూధి, చందనం పంపిణీ చేసేందుకు సన్నాహాలు



ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న మహిళలు

వేపగుంట, జూలై 6: గురుపౌర్ణమిని పురస్కరించుకుని వేపగుంట ముత్యమాంబ ఆలయంలో వరహాలక్ష్మీ నరసింహ కోలాటం బృందం, భాస్కర్ ప్లాస్టిక్, హెల్పింగ్ హ్యాండ్ సహకారంతో 50 వేలమంది భక్తులకు ఉచితంగా విభూది, చందనం పంపిణీకీ చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆలయంలో కోలాటం బృందం సభ్యులు ఈ ప్యాకెట్లను తయారు చేశారు. సేవ చేసిన వారికి ఆలయ కమిటీ భోజన ఏర్పాట్లు చేసింది.

పారిశుధ్య కార్మికుల భద్రత ముఖ్యం

పెందుర్తి, జూలై 6: పారిశుధ్య కార్మికులు భద్రత, సంక్షేమం ముఖ్యమని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. పెందుర్తిలో పారిశుధ్య కార్మికులకు రైన్‌కోటు, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశు భ్రంగా ఉండేలా కార్మికులు పనిచేయాలని కోరారు. పీలా జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

గణిత బోధనపై శ్రద్ధ వహించాలి

విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

గోపాలపట్నం, జూలై 6: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి గణిత ఉపాధ్యాయుల సముదాయాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వి ద్యా శాఖ ఆర్‌జేడీ విజయ భాస్కర్ మా ట్లాడుతూ గణితం బోధనలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కృత్యాధార బోధన, సామగ్రి ఉపయోగించి ఆహ్లాద వాతావరణంలో బోధన చేపట్టాలని సూచించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభంనుంచే వెనుకబడిన విద్యార్థులకు అదనపు సమయాన్ని కేటాయించి వారికి నవరణాత్మక బోధన చేయాలని సూచించారు. టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి గణిత పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన యారాడ, గోపాలపట్నం, ఆనందపురం జడ్పీ పాఠశాలల గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ వై. వేణుగోపాల్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సింధియా జూలై 6: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, వంటి వాటి పట్ల ప్రజలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని డ్వాక్రా సీవో భాను అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించేందుకు శనివారం త్రినాథపురం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నీలాపు జోగి మాట్లాడుతూ అందరూ తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.మాలిబాబు, ఎం.చంద్రశేఖర్, నీలంరాజు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీజనల్ వాధ్యులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

పెదగంట్యాడ: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎదగంట్యాడ ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పైడి హేమలత సూచించారు. డయేరియా మలేరియా చికున్‌గున్యా తదితర వ్యాధుల పట్ల అవగాహన కలిగించేందుకు పెదగంట్యాడ భవిత కేంద్రం ఆవరణలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ వర్షాకాలం వచ్చిందికనుక సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు వంటివి లేకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ రమేష్‌కుమార్, ఏపీ వికలాంగుల నెట్ కన్వీనర్ జీలకర్ర రమణ, భవిత కేంద్రం విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం భవిత కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

నేడు అగనంపూడిలో జగన్నాథస్వామి రథయాత్ర



యాత్రకు సిద్ధం చేసి రథం

అగనంపూడి, జూలై 6: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం జగన్నాథస్వామి రథయాత్రను ఇక్కడి ఆలయం వద్ద ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు రథయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఒడిశా సంప్రదాయం ప్రకారం ఉదయం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు జరిపాక భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలకరించిన ఆశీనలు చేసి, పూజలు జరిపాక రథయాత్ర చేపడతారు. స్థానిక కూడలి నుంచి జాతీయ రహదారి మీదగా ఇంద్రజుమ్మి మందిరం వరకు రథయాత్ర సాగుతుంది. ఇక్కడ స్వామివారిని పది రోజుల పాటు ఉంచి వివిధ అవతారాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. కాగా ఈ నెల 11న హేరా పంచమి సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తారు. అలాగే 16న స్వామివారి తిరుగు రథయాత్రను నిర్వహించనున్నట్టు ఆలయ మేనేజర్ జగన్నాథరావు తెలిపారు.

జగన్నాథునికి ప్రత్యేక పూజలు

పెందుర్తి-రూరల్: మండలం చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో శనివారం జగన్నాథస్వామి రథయా త్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ భక్త బృందం ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష అభిషేకాలు చేశారు. హనుమాన్ చాలీసా నిర్వహించారు.సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం మంగళ హారతులిచ్చి ప్రసాద వితరణ చేశారు.

వేంకటేశ్వరస్వామి పాదాల ప్రతిష్టాపన

పెదగంట్యాడ, జూలై 6: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీ వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారి పాదాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర సాధూ పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద చేతులమీదుగా శ్రీవారి పాదాల ప్రతిష్ఠాపన చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఆలయం ఆవరణలో అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో స్వామివారి పాదుకల దాతలు కొవిరి సత్యారావు, జానకి, ఆలయ కమిటీ సభ్యుడు అప్పలరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు శైలజ, ధనుంజయ, హనుమంతు కొండలరావు, రామలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు నిర్వహించారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు.

సామాజిక భవన నిర్మాణ పనులు పరిశీలన

సింధియా, జూలై 6: జీవీఎంసీ 62వ వార్డు ఏఎస్ఆర్ కాలనీలో జరుగుతున్న సామాజిక భవన నిర్మాణ పనులను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన వార్డులో ఇప్పటికే జరుగుతున్న పలు అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, వైసీపీ నాయకులు జీవన్, ప్రభాకర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన

జగదాంబ కూడలి, జూలై 6: బురుజుపేటలోని కనకమహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి తులసీదళార్చనతో శనివారం పూజలు నిర్వహించారు. అర్చకులు ఉభయదాతలు, అధికారులు పాల్గొన్నారు.

ఘోషాసుపత్రిలో వసతుల కల్పనకు చర్యలు

▸▸ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ

జగదాంబ కూడలి, జూలై 6: వన్‌టౌన్‌లోని విక్టోరియా ఘోషాసుపత్రిలో వసతి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్ పలు ప్రతిపాదనలను ఆయన దృష్టి తెచ్చారు. గతంలో సీఎస్‌ఆర్ నిధులలో భవన నిర్మాణాల ఆధునికీకరణకు ప్రతిపాదన చేసినా, నేటికి పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ భవనం నిర్మాణం, డైట్, అత్యవసర గర్భిణులకు ప్రస్తుతం ఓ షెడ్‌లో పడకలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సీనియర్ ప్రొఫెసర్లకు చాంబర్స్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. పడకల సంఖ్య మరింత పెంచాలన్న ప్రతిపాదనలను ఆయనకు వివరించారు. దీనికి సంబంధిన నివేదికను ఆయనకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసుపత్రిలో భవనాల ఆధునికీకరణకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎస్‌ఆర్ నిధులతో అడ్మినిస్ట్రేట్ కార్యాలయ భవనంతోపాటు గర్భిణుల కోసం ప్రత్యేకంగా భవన నిర్మాణంపై ఏపీఎంహెచ్ఐడీసీ అధికారులతో మాట్లాడనున్నట్టు చెప్పారు. షెడ్‌ల్లో అత్యవసర గర్భిణుల వార్డు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే ఇక్కడ మూడు అంతస్తుల్లో భవననిర్మాణం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా నర్సుల సంఘం సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ ఉద్యోగుల నుంచి వస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. ప్రొఫెసర్లు డాక్టర్ విద్యారమ, లక్ష్మి, ఏవో ఎల్.విజయకుమార్, టీడీపీ నాయకులు గోడి నరసింహాచారి, రాము, గంగాడ గోవింద్, త్రినాద్, జనసేన పార్టీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రమిస్తున్న నర్సులు

వైజాగ్ వారియర్స్‌పై కోస్టల్ రైడర్స్ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 6: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన కోస్టల్ రైడర్స్ మూడు పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్‌పై గెలుపొందింది. తొలి బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 168 పరుగులు చేసింది. షేక్ రషీద్ హాఫ్ సెంచరీ (67), ధరణి కువర్ (21), అభిషేక్‌రెడ్డి (28), నరసింహరాజు (23నాటౌట్) రాణించారు. వైజాగ్ వారియర్స్ బౌలర్ వై.రెడ్డి ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 162 పరుగులు చేసి కేవలం మూడు పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. అశ్విన్ హెబ్బర్ (31), శ్రీకర్ భరత్ హాఫ్ సెంచరీ (69), కరణ్ షండే (41) రాణించినా ఫలితం లేకపోయింది. కోస్టల్ రైడర్ బౌలర్ స్టీఫెన్ మూడు వికెట్లు తీశాడు.

బోరుకు మరమ్మతులు

డాబాగార్డెన్స్, జూలై 6: ఎల్లమ్మతోట ప్రాంతంలో ఎస్‌బీఐ బ్యాంకు వద్ద కొద్ది రోజులుగా మూలకు చేరిన చేతిపంపు అందుబాటులోకి వచ్చింది. టీడీపీ వార్డు అధ్యక్షులు సారిపల్లి మహేష్ చొరవతో వాటర్‌వర్క్స్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సిబ్బంది మోహన్, బూత్ ప్రెసిడెంట్ జి. అల్లాజీ, అంటాడ అప్పారావు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి : ఏసీపీ


మాట్లాడుతున్న క్రైమ్ ఏసీపీ వెంకటరావు

సీతమ్మధార, జూలై 6: యువత డ్రగ్స్‌కి బానిస కాకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని క్రైమ్ ఏసీపీ వెంకటరావు పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఎస్‌బీ ఎం లా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన, ఇళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, చైన్ స్నాచింగ్స్, మొబైల్ స్నాచింగ్స్, వాహనాల చోరీలు తదితర అంశాలపై జాగ్రత్తలు, ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త లా చట్టాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రమణ, ఎస్‌బిఐ బాస్కరరావు, ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మహారాణిపేట, జూలై 6: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి సహకారం అందిస్తానని సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కిరణకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యేతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పీజే గణేష్ కుమార్, నాయకులు అనిమిరెడ్డి రమణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వంశీకృష్ణకు జ్ఞాపిక అందిస్తున్న ఉద్యోగులు

చిన్నారులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి


మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా పరిరక్షించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలలు - మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలపై వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వశాఖల సహకారంతో డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం, సీడబ్ల్యూసీ చైర్మన్ ఎంఆర్ఎల్ రాధ, ఐసీడీఎస్ పీడీ జి జయదేవి, డీఈవో ఎల్ చంద్రకళ, దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ వివేకానంద, పాల్గొన్నారు.

2 డిపోల్లో ఇసుక అమ్మకాలు

... 5వ పేజీ తరువాయి

డిపోకు రాజమండ్రి నుంచి, భీమిలికి శ్రీకాకుళం నుంచి ఇసుక సరఫరా చేయడంతో రెండింటి మధ్య ధరల్లో వ్యత్యాసం ఉంటుందన్నారు. కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, గనుల శాఖ ఏడీ డీవీఎస్ఎస్ఎన్ రాజు, జిల్లా ఉప రవాణా కమిషనర్ రాజారత్నం, జిల్లా పంచాయతీ అధికారి ఎంవీఎస్ శ్రీనివాసరావు, జల వనరుల శాఖ డీఈ చరణ్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈలు పి.శ్రీలక్ష్మి, ఎఎస్ఆర్‌సీ మూర్తి, తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జేసీ సమావేశమయ్యారు. సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఇసుక రవాణాకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇసుక సరఫరాలో ఎటువంటి అవకతవకలు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

ఇసుక సరఫరాలో రవాణా చార్జీలు వసూలు

అయితే విశాఖ జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో గల రీచ్‌లకు వెళ్లి సీనరేజ్, ఇతర పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. రీచ్‌లకు వెళ్లలేని వారికి నగరంలో అగనంపూడి, భీమిలి డిపోల్లో ఇసుక అందిస్తారు. రీచ్‌ల నుంచి రెండు డిపోలకు ఇసుక రవాణాకు అయ్యే చార్జీలు, పన్నులు మాత్రం వసూలుచేస్తారు. ఈ నేపథ్యంలో అగనంపూడి డిపోలో టన్ను ఇసుక రూ.1394, భీమిలి డిపోలో రూ.758కు అందించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఒక వ్యక్తికి 20 టన్నులు ఇసుక మాత్రమే సరఫరా చేస్తారు. ఆధార్ కార్డు నంబరు చూపించి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తే ఇసుక సరఫరా చేస్తామని జిల్లా గనుల శాఖ అధికారి రాజు తెలిపారు.

ఇసుక కోసం పొరుగు జిల్లాలపై ఆధారపడాల్సిందే...

రాష్ట్రంలో అత్యధికంగా నిర్మాణాలు జరిగే విశాఖ నగరం, పరిసరాల్లో నెలకు సగటున 60 వేల టన్నుల ఇసుక అవసరం. అంత ఇసుక ఈ జిల్లాల్లో ఉండదు. జిల్లాలో ఒకే ఒక నది గోస్తనీలో ఇసుక లభ్యత అత్యంత స్వల్పం. ఉమ్మడి జిల్లాలో శారదా, వరహా, తాండవ నదుల్లో కూడా ఇసుక లభ్యత పరిమితం. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న నదుల్లో లభ్యమైన ఇసుకను థర్డ్ ఆర్డర్ రీచ్‌లుగా పిలుస్తారు. కేవలం స్థానికంగా కొద్దిపాటి అవసరాలకు మాత్రమే ఈ రీచ్‌లలో ఉన్న ఇసుక సరిపోతుంది. అందువల్ల విశాఖ నగరంలో నిర్మాణాలకు అవసరమైన ఇసుక కోసం పొరుగున్న శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాలపై ఆధారపడాల్సిందే. శ్రీకాకుళంలో వంశధార, నాగావళి, తూర్పుగోదావరిలో ఉన్న గోదావరి నదుల్లో పుష్కలంగా ఇసుక నిల్వలు ఉన్నాయి. అందువల్ల నగరానికి 220 కి.మీ. దూరంలో ఉన్న గోదావరి నది, 100 కి.మీ. దూరంలో ఉన్న నాగావళి, 120 కి.మీ. దూరంలో ఉన్న వంశధార నుంచి ఇసుక తీసుకురావాలి. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నా...రీచ్‌ల నుంచి నగరానికి తీసుకువచ్చేందుకు అయ్యే రవాణా చార్జీలు, పలు రకాల పన్నులు కలిపి టన్నుకు అగనంపూడి డిపోలో రూ.1,394, భీమిలిలోఅయితే రూ.758 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఉండదు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నదులు అందుబాటులో ఉన్నాయి. ఇసుక అవసరమైన వ్యక్తి ట్రాక్టర్‌తో రీచ్‌కు వెళ్లి టన్నుకు రూ.260 చెల్లిస్తే సరిపోతుంది. ఇసుక ఇంటికి చేరడానికి టన్నుకు మహా అయితే రూ.ఐదు వందల నుంచి రూ.ఆరు వందలు ఖర్చవుతుంది. అదే విశాఖలో మాత్రం గోదావరి ఇసుకకు రూ.1,394, శ్రీకాకుళం జిల్లా ఇసుక రూ.758లు ఖర్చుచేయాలని అధికారులు వివరించారు.

డీసీసీబీలో ఘనంగా సహకార దినోత్సవం

మర్రిపాలెం, జూలై 6: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం మర్రిపాలెం వుడాకాలనీలోని డీసీసీబీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు సీఈఓ డీవీఎస్ వర్మ ఆధ్వర్యంలో తొలుత పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సహకార బ్యాంకుల అభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమైందన్నారు. అలాగే, వారి సమస్యల పరిష్కార బాధ్యత తమపై ఉందన్నారు. రానున్న కాలంలో తమ శాఖల ద్వారా ఖాతాదారులకు, రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కోపరేటివ్ బ్యాంక్ అధికారి గోవిందరావు, విశాఖ జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, జి.హరి ప్రసాద్, సహకార విద్యాధికారి జి.సోమేశ్వరరావు, డి. అన్నపూర్ణ, బి.శ్రీనివాసరావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


సహకార దినోత్సవంలో అధికారులు, ఉద్యోగులు

'కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి'


గండి బాబ్జీకి వినతి పత్రమిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 6: గ్రేటర్ 42వ వార్డులో టీడీపీ బలోపేతానికి, ఇటీవల కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, వార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని కోరారు. ఈ మేరకు ఆయనకు శనివారం వినతిపత్రమిచ్చారు. వార్డు ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నేతలు దువ్వి కాశీప్రసాద్, ఎంఎల్ఎస్ రావు, ముప్పాళ్ల శ్రీకృష్ణ, జీకే ఉన్నారు.

వారాహి అమ్మవారి ఉత్సవాలు

అల్లిపురం, జూలై 7: అల్లిపురంలోని వివేకానందవీధిలోని సాయిశ్రీ మేరు ట్రస్ట్ సాయి దర్బార్ ప్రాంగణంలో శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ప్రసన్న, పి.శ్రీనివాస సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వప్నప్రియ, పద్మజ, పద్మావతి, గ్రంధి రమా, రూపాదేవి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్చరీలో పతకాలు


గణేష్ మణిరత్నంను సన్మానిస్తున్న దృశ్యం

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 6: అంతర్జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్ టోర్నీలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి గణేష్ మణిరత్నం పతకాలు సాధించాడు. ఐర్లాండ్‌లో వరల్డ్ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రజత పతకం, కొరియాలో జరిగిన ఆసియా కప్ ఆర్చరీ టోర్నీలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం సంస్కృతి గ్లోబల్ స్కూల్ యాజమాన్యం గణేష్ మణిరత్నంను సత్కరించి అభినందించింది. జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, స్కూల్ సీఈవో కే నిశాంత్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, క్రీడా కార్యదర్శి ముద్దుబాబు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రైనీ ఐపీఎస్‌లతో సమావేశం

మహారాణిపేట, జూలై 6: మేరీటైమ్ సెక్యూరిటీ మాడ్యూల్ నిమిత్తం నగరానికి వచ్చిన 28 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులతో పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సమావేశమయ్యారు. శనివారం బీచ్ రోడ్డులో ఉన్న పోలీసు ఆఫీసర్స్ మెస్‌లో జరిగిన ఈ భేటీలో తమ అనుభవాలు మెలకువలను కమిషనర్ వివరించారు. విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు .

'ముస్లింలను ఆదుకుంటాం'


అక్కయ్యపాలెం, జూలై 6 : పేద ముస్లింలను ఆదుకొనేందుకు ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కృషి చేస్తుందని అధ్యక్షుడు హైదరాలి సింకా తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో పేద ముస్లిం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవ అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నజీర్ మాట్లాడుతూ.. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సేవలను కొనియాడారు. అనంతరం సొసైటీ సభ్యులు నజీర్‌ను ఘనంగా సత్కరించారు.సొసైటీ గౌరవాధ్యక్షుడు షేక్ అబ్దుల్ మునీర్, ఉపాధ్యక్షుడు అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి అమీర్ జాన్, అలీ ఖాన్, షేక్ అహ్మద్ వలి పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలు అనుసరణీయం

పూర్ణామార్కెట్, జూలై 6: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటి యువత పనిచేయాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ పిలుపు నిచ్చారు. శనివారం గ్రేటర్ 36వ వార్డు రంగిరీజు వీధిలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాబూ జగజ్జీవన్‌రామ్ చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలు మరువరాలేనివని గుర్తు చేశారు. ముందుగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొప్పల వెంకటరావు, జనసేన పార్టీ నేత పీల్లి రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి మహిళా నేత శ్యామల దీపిక పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు గండ్రెడ్డి రాకేష్, జాన్, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా 46వ వార్డు కొండ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ శనివారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత ఆయన స్ఫూర్తితో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో

మహారాణిపేట: బీజేపీ నాయకుల మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు విజయానందరెడ్డి, ప్రకాష్ రెడ్డి, దామోదర్, కోరాడ సాయి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ విల్లాలను అలాగే వదిలేశారు

... 5వ పేజీ తరువాయి

అక్కడ కొందరు ఎలా ఉంటారు?...అంటూ ప్రశ్నలు గుప్పించి వెళ్లిపోయింది. అంతే ఆ తరువాత ఆ నిర్మాణాలకు నిధులు ఆగిపోయాయి. ఆరా తీస్తే అవి తమకు అవసరం లేదని జగన్ భజన బృందం తెగేసి చెప్పినట్టు తెలిసింది. వాస్తవానికి ఆ పనులు వెంటనే పూర్తయిపోయేవే. కానీ ఏపీఎంఎస్ఐడీసీకి సిబ్బంది కొరత ఉండడం, అదే సంస్థకు పాడేరు, మాకవరపాలెంలలో మెడికల్ కాలేజీ నిర్మాణం పనులు అప్పగించడం వల్ల వీటిపై దృష్టిపెట్టలేదు. ఆ విల్లాలు తమకు అవసరం లేదని, మెడికల్ కాలేజీకే ఇచ్చేయండని చెప్పేశారు. నిధులు మాత్రం విడుదల కాలేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది. త్వరగా వాటిని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని యోచిస్తోంది. త్వరలో జరిగే సమీక్ష సమావేశాల్లో వీటిపై చర్చ జరిగే అవకాశం ఉందని విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.

అవినీతి ఖజానా

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులు ఏళ్ల తరబడి తిష్ఠ వేయడం, కొందరు సంఘ బాధ్యులంటూ ఇక్కడే ఉండడం, కొందరు సక్రమంగా విధులకు రాకపోవడం వంటివి విచారణలో రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి వచ్చాయి. పది రోజుల క్రితం విధులకు సక్రమంగా హాజరుకాని పలువురు ఉద్యోగులకు షోకాజ్ జారీచేసిన విషయం కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చింది. ఇదిలావుండగా విచారణ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. బిల్లులు ఆమోదించేందుకు పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పైసలు ఇవ్వకపోతే కొర్రీలు వేస్తున్నారని ఆరోపించారు. ఏ విధంగా చెప్పినా కొందరు సిబ్బంది తీరు మారలేదని, అందుకే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా ఖజానా అధికారి సుధాకర్, ఇతర అధికారులను ఖజానా శాఖ డైరెక్టర్ మందలించినట్టు తెలిసింది. భవిష్యత్తులో ఆరోపణలు రాకుండా విధి నిర్వహణలో కఠినంగా ఉండాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి

... 5వ పేజీ తరువాయి

మూడు నెలల నుంచి పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు మధ్యలో నిలిపివేయకుండా పూర్తిచేయాలని నిర్ణయించింది. వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు చెందిన జేఎస్ఆర్, రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థకు మాత్రం పనులు అప్పగించవద్దని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు పనుల పురోగతిపై గృహ నిర్మాణ శాఖా మంత్రి పార్థసారథి సమీక్షించి అధికారులు ఆదేశాలు ఇచ్చారు. రెండు పెద్ద సంస్థలకు చెందిన లావాదేవీలపై వెంటనే లెక్కలు తేల్చాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు చిన్నపాటి సంస్థలకు అప్పగించాలని సూచించారు. ఇంకా ఇళ్ల నిర్మాణాల కోసం 100 రోజుల ప్రణాళిక రూపొందించారు. 100 రోజుల వ్యవధిలో జిల్లాలో 73 కాలనీల్లో 11 వేల ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసేలా సిద్ధం చేయాలని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో జిల్లా హౌసింగ్ అధికారులు 100 రోజుల ప్రణాళిక అమలుకు సన్నాహాలు ప్రారంభించారు. జిల్లాలో ఏడు నుంచి 10 మంది వరకు చిన్నపాటి కాంట్రాక్టర్లతో మాట్లాడి కాలనీలకు కూలీలను రప్పించి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఉత్తరాదికి చెందిన కూలీలు వెనక్కి రావాలంటే కనీసం రెండు,మూడు వారాలు పడుతుంది. ఇంకా వర్షాకాలం కావడంతో మరికొన్ని ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. అందువల్ల తొలుత స్లాబులు వేసిన ఇళ్ల లోపల పనులు తొలుత పూర్తి చేయాలని యోచిస్తున్నారు.

ఆయన కనుసన్నల్లోనే ఏయూలో పాలన

... 5వ పేజీ తరువాయి

ఎప్పటికప్పుడు ప్రసాదరెడ్డి తెలుసుకుంటున్నట్టు సమాచారం.

కొనసాగే ప్రయత్నాల్లో

గడిచిన ఐదేళ్లుగా కీలక స్థానాల్లో ఉన్న ఎంతోమంది అధికారులు, ప్రొఫెసర్లు వైసీపీతో అంటకాగారు. అదే స్థానాల్లో కొనసాగేందుకు ఇప్పుడు వారు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.


కలెక్టర్ దంపతులకు జ్ఞాపిక ఇస్తున్న అధికారులు

అప్పన్న సన్నిధిలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్

సింహాచలం, జూలై 6 : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సతీసమేతంగా శనివారం వరాహలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో కలెక్టర్ గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి చిత్తరువును అందజేశారు.

దాకమర్రిలో వరి విత్తనాలు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), జూలై 6 : మండలంలోని దాకమర్రి రైతు భరోసా కేంద్రం ఆ గ్రామానికి చెందిన రైతులకు వ్యవసాయాధికారులు శనివారం విత్తనాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు టీడీపీ నాయకులు ప్రకాశ్, ఎ. చిన్నయ్య నాని తదితరులు పాల్గొన్నారు.

ఎండాడలో వారాహి అమ్మవారి ఉత్సవాలు



ఎండాడ, జూలై 6 : ఎండాడ గ్రామంలో ఉన్న కోదండ రామాలయం, షిర్డిసాయి, గణపతి, పశుపతినాథేశ్వరస్వామి ఆలయాల ఆవరణలో ఉన్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. అర్చకుడు సుసరాపు రామకృష్ణశర్మ ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఈనెల 16 వరకు ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, జూలై 6 : తెలంగాణలోని మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన కె. సుధాకర్‌రెడ్డి వరాహ లక్ష్మీ నృసింహస్వామిని నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అన్నప్రసాదం విభాగం ఇన్‌చార్జి ఏఈఓ వి నరసింగరావు, పర్యవేక్షణాధికారి సునీల్‌కు శనివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

బాలికలకు ఆత్మ రక్షణ శిక్షణ

రామ్‌నగర్, జూలై 6 : బాలికలు ఆత్మ రక్షణకు అవసరమైన శిక్షణ తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం వీవీజీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మార్షల్ ఆర్ట్స్, బాక్సింగ్ వంటి వాటిలో శిక్షణ పొందాలన్నారు. బాలికలు చదువే కాకుండా స్పోర్ట్స్, కల్చరల్, సోషల్ సర్వీస్ వంటి వాటిపై కూడా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పోలిశెట్టి వెంకట్, డీఎన్ సతీష్, మార్షల్ ఆర్ట్స్ కోచ్ సందీప్, ధర్మరాజు, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వెంకోజీపాలెం, జూలై 6 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. హరినాథ్ అన్నారు. శనివారం ఆయన ఏయూలోని జాతీయ సేవా పథకం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన తల్లి రుణం తీర్చుకోవాలని భావిస్తారని, అలా భావించేవారు తల్లి పేరు మీద ఒక మొక్క నాటాలని కోరారు. తల్లి ప్రాణం పోస్తే, మొక్క ఆక్సిజన్ ఇవ్వడం ద్వారా ఆ ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, ప్రభాకర్, అర్చన, వై. అనసూయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37,టమాటా 37, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 82, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది) 145, బరబటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 28, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ఇష్టారాజ్యంగా జీవీఎంసీ కమిషనర్

- కూటమి ప్రభుత్వం వచ్చినా... వైసీపీ కార్యకర్తలా అజమాయిషీ
- జేఎస్‌పీ కార్పొరేటర్ మూర్తియాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మూర్తి యాదవ్

విశాఖపట్నం/సిరిపురం, జూలై 6 : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పలు అక్రమాలకు పాల్పడుతున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. కూటమి అధికారంలో ఉన్నప్పటికీ ఆయన ఇంకా వైసీపీ కార్యకర్తలానే వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. శనివారం ఆయన మేఘలయా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిషనర్‌గా వచ్చినప్పటి నుంచి వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్నారు. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్మును ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని, జగన్ రుషికొండ ప్యాలెస్‌ను ఏవిధంగా నిర్మించుకున్నారో, అదేవిధంగా కమిషనర్ తన బంగ్లాను నిర్మించుకున్నారని ఆరోపించారు. సామాన్యులు భవన నిర్మాణాలు చేస్తే ప్రతి రూపాయి కూడా ఫీజుల రూపంలో వసూలు చేసే అధికారులు మాజీ మంత్రి అమర్‌నాథ్ నిర్మించుకున్న ఐదు అంతస్తుల భవనానికి మాత్రం ఫీజు వసూలు చేయకపోవడం గమనార్హమన్నారు. తనను ఎవరూ ఏమీ చేయలేరని ప్రస్తుత ముఖ్యమంత్రి పేషీలో ఉన్న ముగ్గురు సీనియర్ ఐఏఎస్‌ల దీవెనలు తనకు ఉన్నాయని కమిషనర్ చెబుతున్నారన్నారు. కోట్లాది రూపాయలు టీడీఆర్‌లను వైసీపీకి చెందిన వ్యక్తులకు చెల్లించారన్నారు.జీవీఎంసీలో రిటైర్డ్ అధికారిని పెట్టుకుని ఆయన ద్వారా తన పనులన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. గత కమిషనర్ హరినారాయణ్ కేవలం రూ. 18 వేల వరకే తన ఖర్చులను ఉపయోగించుకున్నారని, ప్రస్తుత కమిషనర్ మాత్రం ప్రతి నెల రూ. 3 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ముడసర్లోవ పార్కును సైతం దోచుస్తున్నారన్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ పల్లా సింహాచలం మాట్లాడుతూ గాజువాక సెంటర్ రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షలు టీడీఆర్‌లు చెల్లించాలని కొన్నేళ్లుగా జీవీఎంసీ కార్యాలయానికి తిరుగుతున్నా.. కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, మణివేణి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు


రేబిస్ టీకా కోసం తీసుకువచ్చిన శునకాలు

ఆరిలోవ, జూలై 6 : పెంపుడు జంతువులకు పుట్టిన మూడు నెలలు తరువాత తప్పనిసరిగా రేబిస్ టీకా వేయించాలని కేజీహెచ్ ఆర్ఎంఓ ధవళ భాస్కరరావు అన్నారు. శనివారం తోటగరువులోని పశువుల ఆస్పత్రిలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేస్తున్నారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ఏడాదికి ఒకసారి యాంటీ రేబిస్ టీకా వేయాలన్నారు. వీధి కుక్కలకు కూడా ఈ టీకా వేయిస్తే మంచిదని చెప్పారు. అనంతరం వైద్య సిబ్బంది పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఉప సంచాలకుడు కరుణాకరరావు, వైద్యుడు మోపాడ చంద్రశేఖర్, డీఎల్‌డీఏ వైద్యులు రామ్మోహనరావు, శంకరరావు, సన్యాసిరావు, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ఏటా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని పశు సంవర్థక శాఖ వైద్యురాలు పూర్ణిమ సూచించారు. శనివారం ఇసుకతోట పశు వైద్య కేంద్రంలో ప్రపంచ జూనోసిస్ డే పురస్కరించుకుని పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు అతి త్వరగా వచ్చే వ్యాధి రేబిస్ అని, ఇది కుక్కలతో సన్నిహితంగా ఉంటారు కనుక వాటి నుంచి త్వరగా రేబిస్ సోకుతుందన్నారు. ఏటా జూనోసెస్ డే పురస్కరించుకుని ప్రభుత్వం ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తుందన్నారు. దీన్ని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంప్రదాయబద్ధంగా సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, జూలై 6 : రాముడు జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలో కొలువుదీరిన సీతారామస్వామి సన్నిధిలో శనివారం సంక్షిప్త రామాయణ హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నెలకొకసారి వచ్చే పునర్వసు నక్షత్రం రోజున మాత్రమే ఈ హవనాన్ని చేస్తారు. ఈమేరకు వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు పూర్తి చేశారు. లక్ష్మణ, ఆంజనేయ, సీతా సమేతంగా ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించిన తరువాత బింబారాధన, మండపారాధన, కలశారాధన జరిపారు. అనంతరం హోమకుండలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పద్మహాస చక్రవర్తి తదితరులు తొలుత పంచ సూక్తాలతో, సంక్షిప్త రామాయణంగా పేరొందిన శ్రీమద్రామాయణంలోని బాలకాండ, షడక్షరీ మంత్ర జపాలతో హవనాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

'సింహాచలం క్షేత్ర మహాత్మ్యం' పుస్తకావిష్కరణ

సింహాచలం, జూలై 6 : సింహాచలం క్షేత్ర మహాత్మ్యం పేరుతో ఒడిశాలో ముద్రించిన పుస్తకాన్ని ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సింహాద్రినాథుని భక్తుడు లక్ష్మీకాంత్ నాయకోదాసుడు శనివారం సింహగిరిపై ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని తొలుత ఏవీఎన్ కళాశాల విశ్రాంత తెలుగు విభాగాధిపతి దివంగత టిపి శ్రీరామచంద్రాచార్యులు తెలుగులో రచించారు. దాన్ని దాసుడు కుమారుడు శ్రీమాన్ తమ మిత్రులతో కలిసి ఒడిశాలోకి అనువదించగా సింహాద్రినాథునికి వివిధ కైంకర్యాలకు విరాళాలు సమకూరుస్తున్న నగరానికి చెందిన సాయికుమార్ 500 కాపీలు ముద్రించి దాసుడుకు ఇచ్చారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి

సింహాచలం, జూలై 6 : విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని ఇస్కాన్‌కు చెందిన మాతాజీ నితాయిదాస్ అన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల వికాస్ కేంద్రాల ఆచార్యులు, మాతాజీలకు జరుగుతున్న రెండు రోజుల ప్రత్యేక శిక్షణలో భాగంగా శనివారం ఆమె మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాలను నేర్చుకున్నప్పుడే సమాజం, దేశం పురోగతి సాధిస్తాయన్నారు. కాగా శ్రీదేవి కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఈ శిక్షణా తరగతులకు రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి 170 మంది బాల వికాస్ కేంద్రాల ఆచార్యులు, మాతాజీలు హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రాంత సహ ప్రచారక్ జనార్దన్ మాట్లాడుతూ బాల వికాస్ కేంద్రాలు పిల్లల మనోవికాసానికి తద్వారా సామాజిక వికాసానికి దోహదపడతాయన్నారు.

అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ, జూలై 6 : జీవీఎంసీ పదో వార్డు నాగేశ్వరావుపేటలో సామాజిక భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి అంతస్తు నిర్మాణానికి జీవీఎంసీ రూ. 6 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు. రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి నేత్రోత్సవం

భీమునిపట్నం, జూలై 6 : పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో స్వామివారి నేత్రోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు, కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా సుభద్ర, జగన్నాథ, బలభద్రుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అద్దంలో దర్శనం కల్పించారు. సాయంత్రం సుభద్ర, జగన్నాథుల కల్యాణం నిర్వహించారు.

నో ఎంట్రీ సమయంలో లారీలు వస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దిలపాలెం, జూలై 6 : ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రవేశిస్తున్న లారీలపై ట్రాఫిక్ పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించి ఈ డ్రైవ్ చేపట్టారు. మద్దిలపాలెం, శివాజీపాలెం, ఎంవీపీ కాలనీ ఏరియాల్లోకి వచ్చిన లారీలకు జరిమానా వేశారు. రోడ్డు మీద నిలిపిన లారీలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ద్వారకా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ నో ఎంట్రీ సమయంలో లారీలు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనుమతులు లేకుండా ప్రవేశించిన లారీలకు జరిమానా వేస్తామని చెప్పారు.

కృష్ణాపురం సచివాలయానికి ఫ్యాన్లు వితరణ

పద్మనాభం, జూలై 6 : కృష్ణాపురం సచివాలయానికి స్థానిక టీడీపీ నాయకుడు ఎస్. అచ్చింనాయుడు మూడు ఫ్యాన్లు, తాగునీటి వసతి కల్పనకు అవసరమైన క్యానులు శనివారం వితరణగా అందించారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో ఫ్యాన్లు లేక ఇబ్బంది పడడంతో పాటు తాగునీటి వసతి కూడా లేకపోవడంతో ఆయన తన సొంత నిధులతో వీటిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొకర అప్పలనాయుడు, బి. శ్రీను, ఎం. శ్రీను, ఆచారి, ఎం. అప్పలరాజు, మహిళా పోలీసు సత్యవతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆరిలోవ, జూలై 6 : ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన నిజాం హెల్త్ ఇనిస్టిట్యూట్ వైద్యుడు రమేష్ అన్నారు. శనివారం ఆయన తోటగరవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రవీంద్రబాబు, అనూరాధ, పాఠశాల హెచ్ఎం దుర్గా భవానీ పాల్గొన్నారు.

'సమాజ సేవకు ముందుకు రావాలి'

ఆరిలోవ, జూలై 6 : దాతలు, స్వచ్ఛంద సంస్థలు సమాజ సేవకు ముందుకు రావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ పిలుపునిచ్చారు. శనివారం వారు చినగదిలిలోని ప్రభుత్వ బాలికల హోంలో రాంకి ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పొచాల సముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాంకి ఫౌండేషన్ హెడ్ కనుమెట్ల శ్రీకాంత్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, బాలల సంరక్షణ అధికారి శ్రీలక్ష్మి, హోం పర్యవేక్షణాధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్లు నిర్మిస్తాం

సింహాచలం, జూలై 6 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం త్వరలోనే అన్నిచోట్లా లింక్ రోడ్లు ఏర్పాటు చేస్తామని 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం తెలిపారు. శనివారం 'ఇష్టారాజ్యంగా బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఇప్పటికే ఎస్సీ కాలనీ, చింతచెట్టు కుమ్మరివీధి, తదితర ప్రాంతాలకు కనెక్టివిటీ రోడ్లు నిర్మించామని, మిగిలిన రోడ్లను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని చెప్పారు.

'వినతులను సత్వరమే పరిష్కరించాలి'

పద్మనాభం, జూలై 6 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దారు ఎస్. వెంకటరావు ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సోమవారం గ్రామ, మండల స్థాయిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కుల ధృవీకరణ పత్రాల పరిశీలన కూడా సుమోటోగా పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ కోటి, మండల సర్వేయరు లీల, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభకు గైర్హాజరైన సర్పంచ్‌పై ఫిర్యాదు

పద్మనాభం, జూలై 6 : మండలంలోని బుడ్డివలస పంచాయతీలో గ్రామ సభకు గైర్హాజరయిన పంచాయతీ సర్పంచ్‌పై గ్రామస్థులు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈఓపీఆర్‌డీకి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు జగన్నాథం, పైల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాను అడ్డుకున్న గ్రామస్థులు

భీమునిపట్నం, జూలై 6 : కాపులుప్పాడ రెవెన్యూ పాత కల్లివానిపాలెం గ్రామ పరిసరాల్లో ప్రైవేట్ లేఅవుట్‌దారుడు చెరువును ఆక్రమించడానికి చేసిన ప్రయత్నాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామాన్ని ఆనుకుని సర్వే నంబరు 149/1లో గతంలో చెరువు వుండేది. చెరువు ఎండిపోవడంతో ఆ స్థలంలో గ్రామస్థులు పశువులను మేపుకోవడానికి ఆ స్థలాన్ని వినియోగిస్తున్నారు. చెరువుకు సమీపంలో వున్న ప్రైవేట్ లేఅవుట్‌దారుడు సంబంధిత చెరువును ఆక్రమించుకోవడానికి జేసీబీతో పనులు ప్రారంభించాడు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు జేసీబీకి అడ్డంగా ఉండి స్థల చదును పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారులతో ఆర్ఆర్ ట్రైనీ ఐపీఎస్‌ల సమావేశం

భీమునిపట్నం, జూలై 6 : మంగమారిపేట కమ్యూనిటీ హాల్‌లో శనివారం 76 మంది ఆర్ఆర్ ట్రైనీ ఐపీఎస్‌లు మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మెరైన్ డీఎస్పీ ఎన్. కాళిదాసు మాట్లాడుతూ పోలీసులు తీర ప్రాంతంలో నిరంతరం గస్తీ తిరుగుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. భీమిలి ఎఫ్‌డీవో మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రయోజనాలను వివరించారు. అనంతరం మత్స్యకారుల జీవన విధానం గురించి ట్రైనీ ఐపీఎస్‌లు అడిగి తెలుసుకున్నారు.

ఆదర్శ నేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

పెదవాల్తేరు, జూలై 6 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఆపార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు ఉప్పిలి వంశీయాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ శర్మ, తూర్పు నియోజకవర్గం కన్వీనర్ మురళీమోహన్ రాజు, బీజేపీ మెడికల్ సెల్ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా లాసన్స్ బే కాలనీలోని శాంతి ఆశ్రమం ఆవరణలో బీజేపీ నాయ కులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు రవీంద్ర మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

తగరపువలస : జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు, కేంద్ర మాజీ మంత్రి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ యువతకు ఆదర్శనీయమని గంటా రవితేజ అన్నారు. శనివారం ఆయన తగరపువలస కూడలిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ముఖర్జీ జయంతి సభలో మాట్లాడారు. దేశం మొత్తం అందరికీ ఒకే పౌరసత్వం ఉండాలని ఎలుగెత్తి చాటిన వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు.

సంపత్ వినాయగర్ ఆలయం హుండీ లెక్కింపు

సిరిపురం, జూలై 6 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయం 21 రోజులకు గాను రూ.13,93,548 లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె. శిరీషా తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వెండి 142 గ్రాములు, యూఎస్ఏ డాలర్లు 104, ఎస్‌బీఐ చెక్ రూ.111 వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్, శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులు బి. వసంత్‌కుమార్, దేవాలయ సిబ్బంది డీఎస్ ప్రసాద్, జి. గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కలిశెట్టికి గజమాలతో స్వాగతం


ఎంపీ కలిశెట్టిని సన్మానిస్తున్న నాయకులు

వెంకోజీపాలెం, జూలై 6 : విజయనగరం ఎంపీగా ఎన్నికై ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నగరానికి వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడుకు ఇసుకతోట జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. వారితో పాటు 16వ వార్డు టీడీపీ నాయకులు ముగడ వాసు, తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, పల్లా బాబు, తదితరులు ఎంపీని కలిసి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జనార్దన్, గండ్రెడ్డి సతీష్, కలిశెట్టి భాస్కర్, బంగారునాయుడు, గంగునాయుడు,లక్ష్మణ్‌రెడ్డి, శివ, నారు గోపి, జి. అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


గోకార్టింగ్‌లో ఏర్పాటు చేసిన భక్తులు

వేములవలసలో 'బుజ్జి'

ఆనందపురం, జూలై 6 : మండలంలోని వెల్లంకి జాతీయ రహదారిలో ఉన్న గోకార్టింగ్‌లో కల్కి సినిమాలో వినియోగించిన బుజ్జి కారును శనివారం సందర్శనార్థం ఉంచారు. కల్కి సినిమాలో హీరో ప్రభాస్ వినియోగించిన ఈ కారును రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రజల సందర్శనార్థం ఉంచుతున్నారు. ఈమేరకు గోకార్టింగ్‌లో ఉదయం 9 నుంచి అందుబాటులో ఉంచగా యువత పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. బౌన్సర్లు ఒక్కొక్కరిని లోపలికి పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.హైవే మీదుగా వెళ్లే వాహనదారులు కూడా కారును చూసి ఆనందం వ్యక్తం చేశారు. పోలీసులు ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

చిల్లపేట చెరువు అభివృద్ధికి చర్యలు : జడ్పీ


చెరువు నుంచి దుర్వాసన వస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జడ్పీ

తగరపువలస, జూలై 6 : తగరపువలస, భీమిలి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చిల్లపేట చెరువు నుంచి మూడు రోజులుగా వస్తున్న దుర్గంధంపై స్థానికుల చేసిన ఫిర్యాదుమేరకు జడ్పీ కనక మహాలక్ష్మి అధికారులతో కలిసి శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫిర్యాదుదారులు పిట్ట సురేష్, ఆళ్ల రామకృష్ణ, పల్ల అప్పలకొండ, తదితరులు చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను అధికారులకు చూపించారు. వెంటనే జడ్పీ సిబ్బందితో చెత్త తొలగింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెరువు నీరు బయటకు వెళ్లే ఔట్ ఫ్లో వద్ద చెత్త పేరుకుపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇకపై అక్కడ చెత్త నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో తొలగిస్తామని చెప్పారు. అలాగే చెరువు అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి, సచివాలయం కార్యదర్శులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

236 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

భీమునిపట్నం, జూలై 6 : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో శనివారం గంటా శారదా హెల్పింగ్ హ్యాండ్స్, భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యురాలు సుచిత్ర, క్యాంప్ కోఆర్డినేటర్ రాజు 236 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 45 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌డబ్ల్యూ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు గంటా రవితేజ, గంటా శారదా హెల్పింగ్ హ్యాండ్స్, భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, గంటా నూకరాజు, నీలాపు రెడ్డి, గణేష్‌రెడ్డి, కొప్పల రమేష్, గుండాసు అరవింద్, జోగారావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పనులు ప్రారంభం

భీమునిపట్నం, జూలై 6 : పట్టణంలోని చిన్నబజారు మేదరవీధి వద్ద అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పనులకు జీవీఎంసీ రూ.16. 50 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో జడ్పీ కనక మహాలక్ష్మి, నాయకులు గంటా రవితేజ, చిక్కాల విజయ్‌బాబు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కొప్పల రమేష్, బీజేపీ నాయకురాలు కంటుభుక్త సునీత, గొలగాని నరేంద్రకుమార్, మారోజు సంజీవ్, కనలకల అప్పలనాయుడు, పైడిపల్లి ఎల్లయ్యమ్మ పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18వ వార్డు ఎంవీపీ కాలనీ రైతు బజారు వద్ద ఉన్న అన్న క్యాంటీన్ భవనం మరమ్మతు పనులకు వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలరావు శనివారం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ భవనాన్ని సచివాలయంగా వినియోగిస్తున్నారు. నిర్వహణ కొరవడడంతో భవనం పూర్తిగా పాడయ్యింది. ఈ భవనంలో తిరిగి అన్నా క్యాంటీన్ ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో మరమ్మతు పనులకు జీవీఎంసీ రూ. 15 లక్షలు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు, రవి, కళావతి, ఏఈ వినేష్ పాల్గొన్నారు.

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణకు సన్మానం


వంశీకృష్ణకు సన్మానిస్తున్న శ్రీ వెంకటేశ్వర మెట్ట నాయకులు

మద్దిలపాలెం, జూలై 6 : శివాజీపాలెంలోని జనసేన కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను వెంకటేశ్వరమెట్ట హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటేశ్వరమెట్టలోని ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి బీశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ 33వ వార్డులోని వెంకటేశ్వరమెట్టపై ఉన్న సర్వే నంబర్ 1450లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో ఉన్న స్థలాలు దేవాదాయ శాఖకు చెందినవి సంబంధిత అధికారులు వేధిస్తున్నారని చెప్పారు. ఈ విషయమై దేవాదాయ శాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.